"అందరూ పల్లకి ఎక్కేవాళ్ళే అయితే మోసే దౌర్భాగ్యులు పుట్టేఉండరు." ఇది ధనిక వర్గాల కనక, వస్తువాహనాలు చూసి అసూయతో విసిరిన విరుపుకాదు. కర్మసిద్ధాంతాన్ని ఊతపుచ్చుకుని విరిగిపోయిన వడుము పైకెత్తి సమాధాన పరుచుకొని పోయే శుష్కవేదాంతం కాదు. నా ప్రాణంలాంటి మిత్రుడు సుబ్బారావుకి నేను రాసిన ఒకే ఒక్క వాక్యం అది.

సుబ్బారావు, నేనూ థర్డ్ ఫారం నుంచి బి. ఎస్. సి. దాకా ఒకే దగ్గిర చదువుకున్నాం. కిళ్లీకొట్లో అణాకి చందమామ చదివేసి మళ్లా ఇచ్చెయ్యడం వాడే నేర్పాడు. సెంట్రల్ లైబ్రరీలో మొగలాయి దర్బారు, వాడేవీడు—ఓపికతో వాడే చదివించాడు. కాలేజీకి వచ్చాక హెమింగ్ వే, మామ్, పెరల్‌బక్ పరిచయం చేసింది వాడే!

వాడు నేర్పే ఆల్జీబ్రా లెక్కలకన్నా చదివించిన శ్రీ శ్రీ మహాప్రస్థానం పదిలంగా గుర్తుంచుకునేవాణ్ణి. కెమిస్ట్రీ ఈక్వేషన్స్ స్థానే బెర్నార్డ్ షా రాసిన నాటకం మనస్సులో స్థిరంగా నిలిచిపోయేది. ఫలితంగా పి. యు. సి. రెండు సార్లు తప్పాను. బి. ఎస్. సి. ఆఖరులో పాసయ్యేసరికి వాడు ఎమ్. ఎస్. సి. లో భూగర్భ శాస్త్రాన్ని అగస్త్యుడిలా తాగేశాడు. వాడు రిసెర్చిలో సత్యాన్వేషకుడుగా మిగిలేటప్పటికి కూడికలూ, తీసివేతలూ మొదలుపెట్టి, ప్రభుత్వ యంత్రాంగంలో యంత్రాన్ని అయిపోయాను.

దసరా సెలవలకి ఊళ్లోకి వచ్చిన సుబ్బారావు నన్ను చూడ్డానికి వచ్చేసరికి సరిగ్గా నా కథ ఒకటి పత్రికలో అచ్చయింది. నాటకం ఒకటి ఊళ్లో ఆడారు. తెల్లని దుస్తుల్లో, పరీక్షిస్తున్నట్టు చూసే కాంతివంతమైన కళ్లతో చాలా ఎత్తుగా పెరిగినట్టు నాకు కనిపించాడు. వాడి షేక్స్‌పియర్‌ముక్కు ఏపుగా పెరిగిన ఒంటికి, గుండ్రంగా తయారయిన మొహానికి సరిగ్గా అతుక్కుపోయింది.

కాఫీ ఇస్తూ, "చూడు నాయనా, మా వాడు రెండు వందలు ఖర్చుపెట్టి ఇరవై రూపాయలు కథకి గడించాడు." అంది అమ్మ. జి. పి. ఎఫ్. లో నించి ఇంకో రెండు వందలు తీసి, నే రాసిన నాటకం స్టేజ్ చేయించానని అమ్మకి తెలీదు. అంతవరకూ నేను ఖర్చు పెట్టిన కాయితాలకి, స్టాంపులకి మాత్రమే ఖరీదు కట్టింది.

నవ్వుతో నా వేపు చూసి, "ఏరా, ఇంకా నీకా పిచ్చి వదల్లేదా?" అన్నాడు. వాడు అది అడిగినందుకు నాకు బాధ అనిపించలేదు. ఆ నవ్వులో జాలి ఉంది. చెడిపోయిన త్రాగుబోతువాడి గుండెజబ్బును గుర్తించి తెలియజేసేముందు డాక్టర్ నవ్వే నవ్వది. నా కది భరించరానిదిగా తోచింది. సాయంత్రం చెరువుగట్టు మీద వాడితో గడిచిపోయిన తీయటి బంగారురోజుల్ని, మత్తెక్కించిన ఆశయాల వెచ్చటి కౌగిలింతని గుర్తు చేసుకుని, గొర్రెలు కాసే కుర్రాడి పిల్లనగ్రోవి వింటూ తెలియని పారవశ్యంతో క్షణం వాస్తవాన్ని మరిచిపోయేదాకా నా కా రోజణి పోలేదు.

"ఏరా ఉత్తరాలు రాయడం మానేశావు! రిసెర్చిలో దిగిపోయి బయటి ప్రపంచాన్ని మరిచిపోయావా?" అన్నాను.

భుజాలు ఎగరేశాడు. తమాషాగా తల ఆడించాడు.



ఆ తరవాత చిన్నగా నవ్వేడు.

"రిసెర్చిలో సుఖంలే దబ్బాయి! అది అయిపోయినా మంచి ఉద్యోగం వస్తుందన్న నమ్మకం లేదు. అందుకే మానేసేను" అని చెప్పి క్షణం ఆగాడు. సిగరెట్‌నుసి రాల్చాడు. గట్టిగా దమ్ము లాగాడు.

"ధన్‌బాద్ స్కూల్ ఆఫ్ మైన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసరుగా చేరాను. అసలు అది ఫారిన్ డిగ్రీ లేకుండా ఇవ్వకూడదు. కాని మనం ఆనవాయితీ తలక్రిందులు చేశాం. ప్రస్తుతం స్టేట్స్ పోటానికి పథకం సిద్ధం చేస్తున్నాను. అక్కడ మంచి లేబొరేటరీ కూడా ఉందిలే. రెండు మూడు పేపర్లుకూడా తయారుచేశాను. పోతే ఇక్కణ్నుంచి ఎగిరిపోటానికి కొన్ని పావులు ముందుకు తొయ్యాలి. పెద్ద ఎత్తు వేస్తున్నాను."

వాడి భాష అర్థం అయింది. 'చెస్' నేషనల్, ఇంటర్నేషనల్ వాడే నేర్పాడు. ఎటొచ్చీ వాడి కొత్త హిందీ తెలుగు, బెంగాలీ ఇంగ్లీషు మధ్య నధ్య కొరుకుడు పడలేదు. ఉత్తరాల్లో 'కాబట్టి' అనే పదాన్ని 'కాబడ్డి' గా ఎందుకంత అశ్రద్ధగా రాయగలుగుతున్నాడో కొంచెంగా అర్థం అయింది.

ఎటొచ్చీ వాడి అంతస్తూ, అలవర్చుకున్న అలవాట్లు పాతస్నేహాన్ని మరుగుపరచనందుకు చాలా ఆనందం కలిగింది. వాడున్న రెండు రోజులూ ఊరంతా సర్వే చేశాం. పొలంగట్ల మధ్య, పచ్చని పంటచేనుమధ్య చదరంగం ఆడాం. నేను కొత్తగా రాసిన పల్లెపదాలు పాడాను. పల్లెపడుచులను చూస్తూ 'ఫోక్ లవ్, బేలడ్స్' ని గురించి అయిదు నిమిషాల సేపు లెక్చరు ఇచ్చాడు. చాలాసేపు ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యలు, తన ముందు పరుచుకున్న ఆనందదాయకమైన జీవితము, భవిష్యత్తులో తన లక్ష్యాలు—వీటిని గురించి ఆవేశంగా మాట్లాడాడు.

ఆ రాత్రి నాకు సాహిత్యం, కథలు— అంతా ఉత్తమైకంలా కనిపించి దిగులువేసింది. బ్లడ్‌ప్రెషర్ ఎక్కువై తల తిరిగి మంచాన్ని పడుకున్న అమ్మ మొహంలో ఆవరించిన నీరసం మనసులో దుఃఖాన్ని నింపేసింది. మినుకు, మినుకుమని చుక్కలు కిటికీలో నించి జాలిగా నా కేసి చూశాయి. బయట కుక్క మంచంలో నాన్నని వంకర్లు తిరిగేలా చేసే దగ్గు వికృతంగా వినిపించింది. పాయంత్రం, సుబ్బారావు అన్నమాటలే చెవులో గింగురు మంటున్నాయి. "రేయ్, నీ ఆనందం కోసం, నీతోపాటు, నిన్ను నమ్మకున్న వాళ్లని ముంచెయ్యకు. కమాన్ — ఈ సాహితీసేవ, నాటకాల పిచ్చి కట్టిపెట్టు. ఈ వందాయాభై రూపాయల కట్టుకొయ్యకి జీవితాన్ని బలిచేసుకోకు. యమ్. ఏ. కి కట్టు, ఇంకా నీకు వయస్సుంది. యు. పి. ఎస్. సి. లో కనీసం సెకండ్‌క్లాస్ గెజిటెడ్ కాకపోవు."

ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. ఆలోచనలని పారద్రోలటానికి నే రాస్తున్న 'చీకటి వలయం' నాటకం ఇంకోసారి చదివాను. ఇంకా పూర్తిచెయ్యటానికి మూడో రంగం మిగిలుంది.

"నేను ఇంద్రుణ్ని. . . హ్హహ్హ. . . నిన్ను కుబేరుణ్ని చేసేస్తాను. . . గంధర్వగానం చేసి శ్రుతి తప్పిన రాగాన్ని కొత్తమలుపు తిప్పుతాను. బ్రదర్ రావ్. . . దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకో. లేకపోతే వేయి నాల్కలజ్వాలహాలాహాలాన్ని నింపేస్తుంది... చెప్పు, నువ్వు రుద్రుడివా?. . ."

**బయట ప్రపంచాన్ని మరపించేలా రచయిత తనలో ఒక నవ్యప్రపంచాన్ని సృష్టించుకోవాలి. కానీ బయట ప్రపంచాన్ని గుర్తించి, అందులో తన పాత్ర తాను ధరించాలి. అప్పుడే రచయిత జీవించగలడు. అలాకాక తన సృష్టిలోనే తాను జీవిస్తే జీవితం విషతుల్యమవుతుంది.**

హఠాత్తుగా మెలకువ వచ్చింది. భయంతో చెమటలు పోశాయి. కలలో సుబ్బారావు నేను రాసేనాటకంలో హీరో అయిపోయి నాకు డైలాగుల్లో ఉపదేశాన్ని ఇస్తున్నాడు. నవ్వు వచ్చింది. ఏడుపూ వచ్చింది. సుబ్బారావుని రైలుకి దిగబెట్టేటప్పుడు ఈ సంగతి చెప్పేసరికి నా వేపు చూసి నవ్వాడు. మళ్లీ అదే నవ్వు. రైలు కర్కశంగా కూసి ఇద్దర్నీ విడదీసింది. నవ్వు గుండెల్ని కోసింది.

* * *

సుబ్బారావు వచ్చి రెండు రోజులు మాత్రమే ఉన్నా నా మెదడులో అతను చాలా సంచలనాన్ని కలిగించాడు. ఓ విధంగా చెప్పాలంటే నిద్రపోతున్నట్టు కనిపించే పర్వతం అట్టడుగున భగభగమండే గంధకాన్ని వాడి, జియాలజిస్ట్ బ్రైన్ వెలికి తీసి చూపించి రాబోయే విపత్కర పరిస్థితుల్ని సూచించింది. కృత్రిమంగా కనిపించే ఈ ప్రశాంతత మాటున వాస్తవమనే అగ్నిపర్వతం పొగలూ, సెగలూ కక్కుతూ కనిపించింది. ధన్‌బాద్ చేరగానే చెప్పినట్టుగా వెంటనే ఉత్తరం రాశాడు.

"ప్రియమైన కృష్ణా,

నిన్ను చూశాక నన్ను నేను నిందించుకునే పరిస్థితి వచ్చినందుకు బాధ పడుతున్నాను. నీకు బైరన్, షెల్లీ, ఇబ్సెన్, షా, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రీ తెలియకుండా ఉంటేనే బాగుండేది. బయటి ప్రపంచాన్ని మరిపించేలా నీలోపల ఇంకో నవ్యప్రపంచాన్ని సృష్టించు. కాని బయటి ప్రపంచాన్ని నువ్వు గుర్తించలేనప్పుడు నీ ఊహా ప్రపంచం ఉత్తమాయ. ఇది ఫిలాసఫీ కాదు. నిజానికి ఈ రెండిటినీ సమపాళ్లలో కలిపి జీవితాన్ని, దాన్ని నగిషీలు చెక్కే కవితాశిల్పాన్ని చేతుల్లోకి తీసుకుని ఒక కొత్త ఫిలాసఫీని తయారుచేసేంత పరిణతి కావాలి.

ఇక నా సంగతి. రాబోయే పదేళ్ల ముందు ఎలా ఉంటానో, ఏం చేస్తానో ఊహిస్తున్నాను. చెప్పాను కదూ, జీవితంలో ముఖ్యంగా నాకు కావలిసింది విజయం అని, గ్రహించేసేనని. కవిత్వం, ప్రేమ వగైరా తియ్యటి విషయాలు ఎంత దూరంలో ఉంచాలో అంత దూరంలో ఉంచాను. దాన్ని నమ్మి ఆ బలహీనతకి బందీనయిపోయినప్పుడు నేను మరి యుద్ధం చెయ్యలేను. 'ఐ కెనాట్ వెయిట్ ది కాల్ ఆఫ్ ది వార్ ట్రంపెట్.'

'మెహబుబీ తేరీ ఆంఖోంమే చమక్‌తీ హై చాంద్' అని అంటూ చుక్కలు లెక్కపెడుతూ కూచోలేను. ఆకాశమంత ఎత్తు పెరిగి, జాబిలిని నా ప్రేయసి నుదుట చంద్రవంకగా అలంకరిస్తాను.

ఇప్పటికే చాలా రాశాను. సెలవు.

నీ ప్రియమిత్రుడు,
సుబ్బారావ్."

సుబ్బారావు వేషభాషలకన్నా వాడి ఈ ఉత్తరం ఆకస్మాత్తుగా దూరాన్ని పెంచినట్టు అనిపించింది. 'ఎంతగా మారిపోయాడు' అని వాపోయాడు. హు, వాడికి పదవి, డబ్బు అనే వ్యామోహం నరనరాలలోనూ పట్టేసింది. పూర్ ఫెలో!. . . భౌతికమైన కాంక్షలకి దాసోహమై ఈ సువిశాల విశ్వంలో ఉన్న రమణీయత కాంచలేకపోతున్నాడు. కమనీయమైన కవితాసౌందర్యాన్ని హృదయాన్ని పులికపరిచి, తెలియని లోకానికి తీసుకపోయే మధుర విమల గంధర్వగానాన్ని ఆస్వాదించలేకపోతున్నాడు. వాడిమీద కించిత్ కోపంకూడా వచ్చింది. ఈ కళాతపస్సు, కళాహృదయం లేకపోతే, నేనున్న పరిస్థితుల్లో, వెధవ, గుండె పగిలి చచ్చేవాడు. వాడిమీద ఒక కథకూడా మొదలుపెట్టాను. ఒక రోజు సెలవు పెట్టి, రెండు రోజు ఆదివారంకూడా రిహార్సల్‌కి వెళ్లకుండా ఇదేనినిగా కూ. ని దాన్ని పూర్తిచేశాడు.

సుబ్బారావులాంటి హీరో. అతన్ని ప్రేమించిన అందమైన అమ్మాయి. పెద్దవాళ్లు ప్రేమని హర్షించరు. ఆ అమ్మాయికి వేరే సంబంధాలు చూస్తారు. ఒక రాత్రి, పున్నమి వెన్నెల జగమంతా పరుచుకున్నప్పుడు, హీరో డాబామీది పిట్టగోడమీద కూచుని పరాగ్గా ఏదో ఆలోచిస్తున్నప్పుడు, తెల్లని పాలనురుగలాంటి చీర కట్టుకుని, ఆకాశపు నీలిమని జాకెట్‌గా కుట్టించుకుని, తాచులాంటి నల్లటి పొడుగాటి జట్టులో పరిమళాలు వెదజల్లే గులాబీలు తురుముకుని హీరో ఉంగరాల జుత్తు నవరిస్తూ "పారిపోదాం" అంటుంది ఆమె. ఆమె హృదయస్పందన అతనికి చేరువలో వినిపిస్తూంటే తియ్యగా, లాలనగా అడుగుతుంది.

"నన్ను క్షమించు లీలా" అంటాడు. దీర్ఘంగా నిశ్వసిస్తాడు. తల పక్కకి తిప్పుకుంటాడు. ఎటో చూస్తూ, "నా కెన్నో ఆశలున్నాయి. ఆక్స్‌ఫర్డ్‌లో పెట్రోలియంలోంచి ప్రొటీను ఎంత పెర్సంట్ తీయచ్చో రిసెర్చి చెయ్యాలి'. వేల్స్ యూనివర్సిటీలో 'భారత నూతన తత్వశాస్త్రం', 'ప్రాచీన ఆధ్యాత్మిక సత్యాల్ని' ఏ దృక్పథంతో చూస్తుందో తెలియ చెయ్యాలి. లేపోతే ప్రజలు ఎంత దుర్బలులౌతారో ఊహించు. పాపం. కుర్రాళ్లు విజ్ఞానంలేక ఎంతగా అంధకారంలో పరితపిస్తారో ఒక్కసారి ఆలోచించుకో... క్షమించు లీలా. విశ్వంలో విజ్ఞానం కోసం మనం ఈ ప్రేమని బలిచెయ్యక తప్పదు. నన్ను క్షమించు లీలా!" అని, విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోతాడు.

చివరికి ముసిలి అయ్యేసరికి ఆక్స్‌ఫర్డ్‌లో ఒక చిన్న లెక్చర్ ఇస్తాడు. వెన్నెల రాత్రుళ్లు వెళ్లిపోతాయి. జీవితంలో అనుభవించవలిసిన తియ్యటి రోజులు గతంలో మిగిలిపోతాయి.


తోడూ నీడా లేక చివరికి నిస్సహాయస్థితిలో హీరో మరణిస్తాడు. తన ఆస్తి, రిసెర్చి, రాయల్టీస్—అన్ని తన మాజీప్రేయసి కూతురికి రాసి, పశ్చాత్తాపంతో

కె. ఎస్. ఎన్. మూర్తి

వాణిజ్య ప్రకటనలకు
లోక్ సత్తా
ఉత్తమ సాధనం



నెలసరి రు. 10 -ల చెల్లుబడిమీద
ట్రాన్సిస్టర్ పొందండి




సరికొత్త జపాన్ మోడెల్ సొగసైన పూచీ. ఇవ్వ బడిన " నేషనల్ 70 " అఖిల ప్రపంచం 3 బాండ్ల ట్రాన్సిస్టర్—డయల్ లైటుతో ప్రతి వస్తేకు, పట్టణానికి పంసవచును. త్వరపడండి.

WRITE YOUR LETTER TODAY
MUSIC & SOUND (N)
P. BOX 1576, DELHI-6


ఆఖరవుతాడు. అదీ కథ. పత్రికకి పోస్ట్ చేసేముందు రాజారావుకి చూపించాను.

"ఒరే కాళిదాసూ, ఈ దెబ్బతో నీ పేరు కథా ప్రపంచంలో మణిపూసగా చిరస్థాయిగా నిల్చి పోతుందిరా!" అన్నాడు. రాజారావు నేను రాసిన నాటకాన్ని పరిషత్ పోటీలకి డైరెక్ట్ చేస్తున్న స్టేజీ యాక్టర్. నేను నాటకాలు రాయడం మొదలుపెట్టాక నాకు వాడు పెట్టిన ముద్దు పేరు "కాళిదాసు".

నిన్న ఉదయం మా హీరోయిన్ (డ్రామా) శలవొకగా వచ్చింది. అప్పుంగా కథలో హీరోయిన్ శీల మబ్బు పడింది. గది అంతా నిశ్శబ్దంగా కనిపించింది. మిగిలిన వాళ్ళు రిహార్సల్‌లో పడిపోయారు. తరవాత రాజారావు చక్కని పాట పాడాడు. అదికూడా నేను రాసిందే. శ్రవ్యంగా, గొంతులోనున్న బాధనంతా మేళవిస్తూ, ఒక కళాతపస్వి వాడిపోయిన మల్లెమొగ్గని గురించి పాడినపాట అది. నా కళ్ళంట అశ్రువులు జారాయి. గది మధ్యన వెలిగించిన అగరువత్తులు సువాసనలు నింపుతున్నాయి. 'చాలు, చాలు నా కీ బ్రతుకు— ఇంత మంది గొప్ప రసహృదయులు చుట్టూ ఉంటే ఇంక జీవితంలో శూన్యత ఎక్కడ?' అని, అనిపించింది. రాత్రి కథ పోస్ట్ చేశాను. నాలుగు వారాల తరవాత కథ అచ్చయింది. ఇంకోవారానికి అది చదివిన సుబ్బారావు నాలుగు పంక్తుల ఉత్తరం రాశాడు.

"ఒరెయ్ కాళిదాసూ,

నువ్వు నా మీద అంత మంచి కథ రాయగలిగి నందుకు అభినందిస్తున్నాను. నీ నాటకాల్ని, రాజారావు లాంటి మిత్రుల్ని చూసి చాలా ఆనందించాను. చేతిలో డబ్బుంటే కాగితంపువ్వుకి పరిమళం వస్తుంది.

నువ్వు రాస్తున్న నాటకంలోని మూడో రంగం నన్ను పూర్తిచెయ్యనివ్వు. అమ్మ బ్లడ్ ప్రెషర్‌కి డాక్టర్‌కి చూపించాలన్న ఆలోచనకానీ, నాన్న దగ్గుకి మందు తేవాలన్న బాధ్యతగానీ తెలీని నీ హీరో: ప్రేయసికి కలలో ఫ్రాన్స్‌నుంచి 'స్వీట్ నైట్' సెంట్ తెచ్చి ప్రెజెంట్ చేస్తాడు. ఇంటినుంచి పారిపోయి, హీరోయిన్ తినిపించే ప్రేమ తిని, ప్లాట్‌ఫారం మీద బ్రతుకు తాడు.

రాజారావులాంటి ఏ సినిమాయాక్టరో, సుబ్బారావు లాంటి ఏ ఛీఫ్ జియాలజిస్టో ట్రైన్‌లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కనపడి, పెట్టెలు మోస్తున్న నిన్ను పలకరిస్తే ఏమంటావు? జేబులోంచి విజిటింగ్ కార్డు తీసిఇచ్చి, 'చూడు. ఆ మేఘాలపతల ఉంది మా ఇల్లు. డ్రాప్ ఇన్. విషల్ హేవ్ ఎ కప్ ఆఫ్ అమృతం' అంటావా? ఉంటాను.

నీ మిత్రుడు,
సుబ్బారావు."

ఉత్తరం చదవగానే తల తిరిగిపోయింది. ఎంత నీచంగా చిత్రించుకున్నాడు. నా ప్రాణం లాంటి మిత్రుడు సుబ్బారావు ఆఖరికి, నాకు ప్లాట్‌ఫారం మీద పెట్టెలు మోసే పోర్టర్‌గా స్థానాన్ని ఇచ్చాడు. ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకినట్టనిపించింది. అవమానంతో శరీరం దహించుకు పోయింది. ప్లాట్ ఫారం మీదికి పోయి స్పీడుగా వస్తున్న రైలుకింద బుర్ర పెట్టాలనిపించింది.

తిన్నగా పోయి రిహార్సల్ చేస్తున్న రాజారావుకి, మరికొందరు మిత్రులకి చెప్పాను. రాజారావు చాలా జాలిపడ్డాడు నా మీద.

"గురూ, ఇంత చిన్న విషయాన్ని గురించి ఆలోచించు కుని బుర్ర పాడుచేసుకోడంలో అర్థం లేదు. మనం కళాకారులం. మనం అర్థంకాక ఏడ్చేవాళ్ళని ఏడవనీ. ఓరప్" అని భుజం తట్టాడు.

నాకు కొండంత బలం వచ్చినట్టయింది.

"లేడీస్ అండ్ జెంటిల్‌మన్! ఇవాళ కాళిదాసుగాడి మనస్సు బాగాలేదు. అందుకని రిహార్సల్ ఇంతటితో ఆపేసి, మన మనోరంజనీ సమాజ సభ్యుడు, యువకవి, కళ కోసం జీవితాన్ని సైతం అర్పించగలిగే త్యాగశీలి అయిన కాళిదాసు మనస్సు రంజించే నిమిత్తం చిన్న పార్టీ చేసుకుందాం" అని కూచున్నాడు.

జగన్నాథం పోయి అల్మెయిరా లోంచి బాటిల్ తీశాడు. జరిగేది ఆలోచించేలోగా చేతిలోని గ్లాసు పెదవులకి అందించాడు రాజారావు. నాన్నకి కొనవలసిన మందు గుర్తు వచ్చింది. సుబ్బారావు ఉత్తరంలోని విషయం జ్ఞప్తికి వచ్చింది.

"తాగేసెయ్ బ్రదర్, మనం ఇప్పుడు మేఘాల్లో ఉన్నాం. అమృతం ఒక్క చుక్క మిగల్చకుండా తాగేసెయ్!" రెండో గ్లాసు ఖాళీ చేస్తూ రాజారావు తొందర చేశాడు. ఆలోచించకుండా కళ్ళు మూసుకు తాగేశాను.





జే. అండ్ జే. డషేన్
హైదరాబాద్ - ఇండియా.

. . . సుబ్బారావు మళ్ళీ అంటున్నాడు. "చూడు— ఆ మేఘాలపతల ఉంది మా ఇల్లు— డ్రాప్ ఇన్— షెల్ హేవ్ ఎ కప్ ఆఫ్ అమృతం."

ఆ రోజుకి నాటక కళా పరిషత్ పోటీకి మేం వెళ్ళడానికి రెండే రోజుల అవకాశం ఉంది. హీరోయిన్ కళ్ళు ఎర్రనా మందార రేకుల్లా కనిపిస్తున్నాయి. రాజారావు నాటకంలోని డైలాగ్ అంటూ ఆమెను పొదివి పట్టుకున్నాడు. ఇక అక్కడ ఉండడానికి మనస్కరించ లేదు. తూలుతూ ఇంటికి చేరుకున్నాను. నాన్న వీధి వరండాలో వంకర్లు తిరుగుతూ దగ్గుతున్నారు. ఎర్రని పచ్చిరక్తం పగరుస్తూ వాంతి చేశారు.

ఎర్రని రక్తం — ఎర్రని మందార రేకుల్లాంటి కళ్ళు — ఎర్రని పానీయం. మెదడులో అగ్నిపర్వతం బద్దలయింది. తాములా వంకర్లు తిరుగుతూ, బుసలు కొట్టే పొగలూ, సెగలూ కక్కే లావా — వ్యాకంపాలల అడుగున అణగారి పోయింది.

* * *

రాజారావు పరిషత్తు పోటీకి ఆఖరికి నా నాటకం తీసుకువెళ్ళలేదు. నాటకంలోని హీరోయిన్ని మాత్రం వెంటతీసుకుని ఊరు వదిలిపోయినట్టు చూచాయిగా తెలిసింది. బాగా డబ్బు ఉన్నవాడు కాబట్టి ఎక్కడికి వెళ్ళినా, రాజారావు రాజాలాగ వెలిగిపోగలడు. ఎటొచ్చీ నా లాంటి దురదృష్టవంతుడు అతని సరదాలకి, చదరంగంలో పావుగానిలిస్తే బ్రతకటమే కష్టం కావచ్చు.

నాన్నకి వచ్చిన రాజాలాంటి, గుండెల్ని తినేసే జబ్బు, మందులతోబాటు మనుషుల్ని తినేస్తుందని డాక్టర్ చెప్పేదాకా నాకు తెలీలేదు. నెలకి నూటయాభై తెచ్చే నా జీతం నాన్నని బ్రతికించుకో లేకపోయింది. అమ్మకున్న బ్లడ్ ప్రెషర్ అంతటితో హెచ్చిపోయి, కూడికలూ, తీసివేతలూ చేసే గుమాస్తా ఉద్యోగానికి అప్పుల గుణకారాలు నేర్పింది. అమ్మకూడా నాకు దక్కని పరిస్థితి వచ్చేసరికి ఆఫీస్ కేష్ బాక్సులోకి ఐదు వందల రూపాయలూ, తెగించి తీసుకువచ్చేశాను. అదికూడా ఆరిపోగా, అంతవరకూ నే చేసిన అలక్ష్యం శాపంగా మారి నన్ను దిక్కులేనివాణ్ణిగా చేసింది.

ఎవరూలేని ఏకాకిగా నడివీధిన నిలబడ్డ నన్ను చూసి జాలిపడి, ఆఫీస్ డబ్బు వాడినందుకుగా, ఆఫీసు నుంచి నాకు రావలిసిన డబ్బు దానికి సరిపెట్టేసి అరెస్ట్ చెయ్యకుండా వదిలిపెట్టారు.

జరిగింది మరిచిపోటానికి రాజారావు తాగించిన అమృతం రుచి చూసేవాణ్ణి. నిషా దిగేక గుండె పగిలేంత దుఃఖం కట్టలు తెంచుకునేది. రాత్రి తరవాత, పగలు రాకమానదు. నిషా దిగాక, పరిసరాలు కనిపించక మానవు. చేతిలో మిగిలిన చిల్లరకూడా అయిపోగానే అమృతంకూడా గగనం అయిపోయింది. ఊళ్ళో ఉండ టానికి మొహం చెల్లక ఒక రాత్రి, నన్నెవడూ గుర్తించ లేనంత దూరంలో ఉన్న పట్నం వచ్చేశాను.

పారిపోయి వచ్చేశాను గాని ముక్కూ మొహం తెలీని ఊళ్ళో ఆశ్రయం సంపాదించటం ఎంత కష్టమో అనుభవంమీద గాని తెలీలేదు. పత్రికలకి కథలు రాసే ఉత్సాహం ఏనాడో చల్లారిపోయింది. అథవా డబ్బు కోసం కక్కుర్తిపడి రాసినా, నైరాశ్యం నిండిన, నా ఏడుపుకథల్లో గొప్పతనం కనిపించక గాబోలు పత్రికాధి కారులు తిప్పి పంపేసేవాళ్ళు.

కాలచక్రం గిర్రున తిరిగింది. దారిద్ర్యంగాని, దుఃఖంగాని బ్రతుకుమీది తీపిని చావనివ్వదేమో! ఆ స్పిరిట్ని ఏదీ నాశనం చెయ్యలేదేమో. సినిమాల్లో లాగ కేలండర్లు మారిపోతున్నాయి. బతకటం కోసం నే పడ్డ యాతనలో ఐదేళ్ళు పాదరసంలా జారిపోయాయి. కాళ్ళరిగేలా ఉద్యోగం కోసం ప్రయత్నించిన నాకు బట్టలకొట్లో ఉద్యోగం స్థిరపడింది. ఈ ఐదేళ్ళలోనూ ఒక రోజుకీ, ఇంకో రోజుకీ తేడా నా కేం కనిపించ లేదు. కొట్లో కౌంటర్కి ఎదురుగా ఉన్న అద్దంలో మాత్రం లోతుకు పోయిన దవడలు ఇంకాస్త లోతుకు పోయి కనిపించేవి. జుత్తులో తెల్లవెండ్రుకలు అకాల వార్ధక్యానికి మెరుగు పెట్టాయి.

మనసులో గుబులు పుట్టినప్పుడు, పాతజీవితం దొలిచేసినప్పుడు, పిచ్చిపిచ్చి గేయాలు చిత్తుకాయితాల మీద రాసినప్పుడు షావుకారు అప్పుడప్పుడు మందలించే వాడు. ఆదివారాలు సినిమాకి వెళ్ళినప్పుడు ఆ రాత్రి అంతా హీరోయిన్ నన్ను కలలో ముద్దులతో నింపేసి, నా చెయ్యి పట్టుకుని మేఘాల్లో విహారం చేసినా, పగలు మాత్రం ఒక పూట డొక్క మాడ్చుకోవలిసి వచ్చేది.

అయితే సుబ్బారావు నాకు గుర్తులేడు. హీరో రాజారావు గుర్తులేడు. దగ్గుతో మెలికలు తిరిగి, పోయిన నాన్న గుర్తులేడు. అమ్మ నీరసంతో కూడిన మొహం గుర్తులేదు. ఒక రకమైన స్తబ్దత, శూన్య కోరకుండానే వచ్చిన యోగుల నిర్వికార నిశ్చలావస్థ.

కాని అది ఎంతోకాలం నిలవలేదు. షావుకారు జాపమరిది ఒక మంచిరోజు చూసి కౌంటర్కి బస్తం వేశాడు. తెలిసే షావుకారు నా ఉద్యోగానికి మంగళం పాడేశాడు. తిరిగి బతకడం కోసం బజార్లు పట్టవలిసి వచ్చింది. ఈసారి మాత్రం ఇంతకు మునుపెన్నడూ లేని విరక్తి జీవితంమీద కలిగింది. బికారివెధవని, చేజేతులా జీవితం పాడు చేసుకున్నాను. నాన్నని బ్రతికించుకోలేకపోయాను. అమ్మని పొట్టన పెట్టు కున్నాను. ఆ శాపం నన్ను నిలువునా కాల్చేస్తోంది. ఆ పాపానికి ఈ ప్రాయశ్చిత్తం చాలదు. ఇదికాదు నిష్కృతి. ఆవేశంగా మిగిలిన ఆస్తి అయిన సర్టిఫికెట్ చింపేశాను. కాలవలోకి గిరవాటేశాను. ఇంత దయ నీయమైన పరిస్థితిలోకూడా బతుకుమీద చావని ఆశతో జీవితాన్ని ఈడుస్తున్న నా మీద నాకు అసహ్యం వేసింది. 'రేయ్, కృష్ణా, ఉరఫ్ కాళిదాసూ, ఈ బురదలో ఇంకా పొర్లాడకు. నీ అవకాశాలన్నీ బురదలో పోసిన పన్నీరయ్యాయి. ఈ పశ్చాత్తాప వహ్నిలో కాగిపోకు. ఈ రంపపుకోత పెట్టే చిత్రహింసకి బలి కాకు' అంతే!. . . పిచ్చెత్తినట్టుగా వడివడిగా స్టేషన్ కేసి నడక సాగించాను. . . . క్షణం ఆగి గుండె నిండుగా గాలి పీల్చాను. నేను రాసిన చిట్టచివరి పాటకి వరసకట్టి, బిగ్గరగా దార్లో ఆఖరిసారిగా పాడుకున్నాను. దార్లో కనిపించిన గడ్డాలు పెంచిన సన్యాసికి వంగి పాదాలకి నమస్కారం చేశాను. అతను తెల్లబోయి చూశాడు. స్పీడుగా వస్తున్న కారును ఆపి అందులో ఉన్న జంటను చూసి కేరింతాలు కొట్టి, అతనికి షేక్హాండ్ ఇచ్చాను. ఆ అమ్మాయి నా వైపు అయోమయంగా చూసింది. స్టేషన్లో మూడో బెల్ కొట్టటం వినిపించింది. 'అమ్మో! రైలు వచ్చేస్తోంది. తొరగా పరిగెత్తటం మొదలుపెట్టాను. మెదడులో ఆలోచనలు పరిగెడుతున్నాయి. లీలగా ఏదో గుర్తు వచ్చింది. అవును, ఇంతకు మునుపొకసారి రైలుకింద బుర్ర పెట్టాలన్న ఆలోచన వచ్చింది. స్టేషన్ చేరుకున్నాను. ఒక్క అంగలో ప్లాట్ఫారం చేరాను. కాని అప్పుడే ట్రైన్ వచ్చేసి నిలుచుంది.

అందరూ గోలగా ఒకే దిక్కు పరిగెడుతున్నారు. ఇసకవేస్తే రాలని జనం. ట్రైన్కి వెనకఉన్న బోగీవేపు, యోచించకుండా నేనూ పరిగెత్తాను . . . అతను చంద్రుడిలా చిరునవ్వులు ఒలకబోస్తున్నాడు. కెమెరాఫ్లాష్లు క్లిక్ మంటున్నాయి. అవి నా కళ్ళకి మిరుమిట్లు గొలిపాయి. వాడు సందేహం లేదు!... రాజారావు!

"రాజారావూ!" అని బిగ్గరగా అరిచాను. గుంపును తోసుకుని ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్లో ఉన్న రాజారావు కేసి తిరిగి, "ఒరే రాజారావు! నేను... నేనూ కాళిదాసుని" అని పిచ్చివాడిలా అరిచాను.

అతను నన్ను ఎరిగినట్టుగా, అయోమయంగా చూశాడు. గొంతు చించుకుని అరిచిన నన్ను ఎవడో రెక్క పట్టుకుని వెనక్కిలాగేసి "సినిమా యాక్టర్ రాజశేఖరంరా, పిచ్చిసన్యాసీ" అని ముందుకు పోయాడు. కిందపడిపోయి 'అవును, రాజారావు' అని మూలిగాను. నన్ను లేవనెత్తి ఫుల్ సూటులోని వ్యక్తి ఒకడు బరబరా గుంపులోంచి లాక్కెళ్ళి, దూరంగా నిలబెట్టాడు. నా కళ్ళు మోసం చెయ్యకపోతే వాడు సుబ్బారావు. మాట్లాడనివ్వకుండా నన్ను గుండెలకి అదుముకున్నాడు. నేను బి. ఎస్. సి. పాసయిన రోజు వాడు ఇలానే కౌగలించుకున్నాడు.

నా బట్టలు చూసుకున్నాను. మట్టి కొట్టుకుని పోయాయి.అక్కడక్కడ ఉన్న చిరుగులు ఒంటి చర్మాన్ని చూపిస్తున్నాయి. ఇటూ, అటూ చూశాను. . . పక్కనే ఉన్న ఎవరిదో సూట్కేస్ చేతో పట్టుకున్నాను. ఆపుకుందామన్నా ముళ్ళు తిరుగుతూ ఏడుపు గొంతుక లోంచి కోసుకువస్తోంది. వెక్కుతూ,వణికే కంఠంతో,

"ఒరే, సార్ . . . మీరు సైకియాలజిస్ట్ సుబ్బారావు. . . ఆ. . .ఆ. . .మే. . .ఘా. . .ల. . . ప. . . త. . .ల. ఉంది. మా ఇల్లు. . . డ్రాప్. . . ఇన్ . . . వి షెల్ హేవ్ ఎ కప్ ఆఫ్ అమృతం." అని, . . . అంతే, సూట్కేస్ పడేసి వాడి కందకుండా పరిగెత్తాను.

ఏదైతే నేను అసహ్యించుకుని రైలుకింద బుర్ర పెడదామనుకున్నానో అది నా చావుకు ముందే ఎదు రయింది. ఇంకా నేను బ్రతికున్నాను అని అనుకొంటున్న న్దుందుకు నాకు నవ్వు వచ్చింది. ఇక బ్రతికినా చచ్చినట్టే లెక్క చచ్చినా చావనట్టే లెక్క. రైలు కదిలిపోయింది. ఫస్ట్ క్లాస్ కంపార్ట్మెంట్ దాటి పోయింది.

మరునాడు జేబులో మిగిలిన పది పైసలతో కార్డు కొని, సుబ్బారావు పాతఎడ్రస్కి ఒక్క వాక్యం రాసి పోస్ట్ చేశాను. అది ఎప్పుడయినా వాడికి చేరక మానదు.

"ఒరే సుబ్బారావ్,

అందరూ పల్లకీ ఎక్కేవాళ్ళే అయితే దాన్ని మోసే దౌర్భాగ్యులు పుట్టి ఉండరు! సెలవు!

కృష్ణ." ★

---

**పరిశ్రమ**

పరిశ్రమించని వ్యక్తికి భగవాను డెన్నడు సాయపడడు.

—సోఫోక్లిస్